# మధన్నను గెలిపిస్తేనే మంథని అభివృద్ధి



రామగిరి ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్, పెద్దపల్లి ఎంపీ వేంకటేశ్ నేతకాని

- **70 వేల ఓట్ల మెజార్టీని కట్టబెట్టండి**
- **సీఎం కేసీఆర్ ఇచ్చే వెయ్యికోట్లతో అభివృద్ధికి బాటలు వేసుకోండి**
- **సింగరేణి నష్టాలకు కాంగ్రెస్సే కారణం**
- **బీఆర్ఎస్ పాలనలోనే కార్మికులకు న్యాయం**
- **రామగిరి ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

పెద్దపల్లి, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): 'మంథని మట్టి బిడ్డ పుట్ట మధన్న నేను వదిలిన బుల్లెట్. మాట తూటాలాగా ఉంటది. కానీ చాలా మంచి వ్యక్తి. మూడోసారి మీ ఆశీర్వాదం కోసం మీ ముందు నిలబడ్డడు. మీరు అవకాశమిస్తే మరోసారి మంథని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపుతడు. గెలిచినా.. ఓడినా మీ మధ్యనే ఉన్నడు. సేవ చేసిండు. 70వేల ఓట్ల భారీ మెజార్టీతో పుట్ట మధన్నను గెలిపించండి. గులాబీ కండువా ఇక్కడ ఉంటే నిధులు వరుదలా వస్తయి. జరిగిన అభివృద్ధిని చూడండి. బీఆర్ఎస్‌ను గెలిపించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోండి' అని ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి మంథని నియోజకవర్గంలోని రామగిరి మండలం సెంటినరీకాలనీ వాణి విద్యానికేతన్ క్రీడా మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పుట్ట మధన్నను గెలిపిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం ఏ విధంగా అభివృద్ధి జరిగిందో ఆ విధంగా మంథని నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ అనేక సభల్లో పాల్గొన్నారని, కానీ మంథని సభలో రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ అలా ప్రకటించారంటే మంథని నియోజకవర్గాన్ని ఆయన దత్తత తీసుకున్నట్లేనని ఆమె వివరించారు. నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కారం కావాలంటే సీఎం కేసీఆర్‌కు దగ్గరైన పుట్ట మధూకర్ ఎమ్మెల్యే కావడంతోనే సాధ్యమవుతుందన్నారు. మీ అందరికీ వినమ్రంగా చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నా మధన్నను గెలిపించాలని ఆమె కోరారు. సీఎం కేసీఆర్ 15 ఏండ్లు ఉద్యమం బావుట ఎగురవేస్తే సింగరేణి కార్మిక క్షేత్రం ఆయనకు వెన్ను దన్నుగా నిలిచిందన్నారు. సింగరేణి సమ్మె చేయగానే సౌత్ ఇండియాలో పవర్ కట్ అయి ఢిల్లీలో పవర్ ఫీవర్‌తో తెలంగాణ ప్రకటన వచ్చిందని గుర్తుచేశారు. ఇది సింగరేణి కార్మికుల ఘనతను చెప్పుకోచ్చారు. పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచారని, ప్రజల అక్కర్లను తీర్చారన్నారు. 22 అంశాల్లో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కేసీఆర్ గెలిచిన వెంటనే రేషన్ కార్డులను ఇచ్చుకొని రైతు బీమా మాదిరిగా అందరికీ జనరల్ బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెడుతారని చెప్పారు.

### నాడు సింగరేణిని దివాలా తీయించింది కాంగ్రెస్సే

నాడు సింగరేణిని అప్పుల పాల్జేసి దివాలా తీయించింది కాంగ్రెస్ పార్టే. సింగరేణి బొగ్గు బ్లాక్‌లు పోయే దుస్థితిలో ఉండగా నిలుపుకోవడానికి అప్పులు చేసిన మాట వాస్తవం కాదా..? అందు కోసం కేంద్రానికి 49 శాతం వాటా ఇచ్చి సింగరేణిని తాకట్టు పెట్టింది నిజమే కదా. కాంగ్రెస్ అధికారంలో ఉంటే సింగరేణి ఎప్పుడో మూత పడేది. ఈ విషయాన్ని ప్రతి సింగరేణి కార్మికుడూ గుర్తించాలి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీబీజీకేఎస్ ప్రాతినిధ్యంతో సింగరేణిలో అనేక బొగ్గు బ్లాక్‌లు మూత పడకుండా కృషి చేసినం. కార్మికులకు 32 శాతం లాభాల వాట వచ్చేలా చేసినం. వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించుకొని 12వేల మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇప్పించుకున్నం. పెండింగ్‌లో ఉన్న 3500 మందికి ఉద్యోగాలు కల్పించుకున్నం. బీఆర్ఎస్ పాలనలో 19వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నం. ఈ ఉద్యోగాల కోసం మనం ప్రయత్నం చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం కేసులు పెట్టుకుంటూ వెళ్లిన్రు. ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ సింగరేణి బతికించుకున్నం. ఆర్టీసీ, ప్రభుత్వ రంగ సంస్థలను, పబ్లిక్ సెక్టార్ల, ప్రైవేట్ సెక్టార్లను కాపాడుకోవడానికి కేసీఆర్ కృషి చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ వాటిని అమ్మకానికి పెడుతున్నది. సింగరేణి సిరుల వేణి. తెలంగాణ మన ప్రాణం.. ఆ ప్రేమ కాంగ్రెస్‌కు అర్థం కాదు. రేవంత్‌రెడ్డి నుంచి మొదలుకొని శ్రీధర్‌బాబు వరకు అవినీతి గురించి మాట్లాడుతున్నరు. అసలు అవినీతి పరులు వాళ్లే.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

### ఆరోపణలకు లెక్కా, పత్రం ఉన్నదా..?

తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టును ₹80వేల కోట్లతో నిర్మిస్తే.. లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి మొదలుకొని, శ్రీధర్‌బాబు వరకు అర్థరహిత ఆరోపణలు చేస్తున్నరు. వారి ఆరోపణలకు ఏమైనా లెక్కా, పత్రం ఉన్నదా..? మేం కూడా అలా చౌక బారు విమర్శలు చేయచ్చు. కానీ అది మా నైజం కాదు. సీఎ కేసీఆర్ తన శక్తి, మేధస్సు, రక్తాన్ని కరిగించి అనేక కార్యక్రమాలను రాష్ట్రం కోసం చేసిండు. కాంగ్రెస్ హయాంలో రైతులను పిలిచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కానీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి 73లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నడు. మరో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 50లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే ఆలోచనలో ఉన్నడు.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

### శ్రీధర్‌బాబు చేసిన పనులు చూపించు

శ్రీధర్‌బాబు మంథని నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఇక్కడి ప్రజలకు చేసిందేమీలేదు. తొమ్మిదిన్నరేళ్లలో మా తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏంటో మేం చూపిస్తం. నీకు ధైర్యం ఉంటే ఇన్నేండ్లలో చేసిన అభివృద్ధి ఏంటో చూపించు. ఎక్కడికి రమ్మంటావో అక్కడికి మా అభ్యర్థి పుట్ట మధూకర్ వస్తడు. నీకు చిత్తశుద్ధి ఉంటే వచ్చి నిరూపించుకోవాలి. కాబోయే ఎమ్మెల్యే పుట్ట మధన్నే. మంథని ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి. రాష్ట్రంలో కేసీఆర్ సర్కారే వస్తుంది. ఇదే విషయాన్ని అన్ని సర్వేలు చెబుతున్నయి. మంథని నియోజకవర్గంలో మళ్లీ పొరపాటును, గ్రహపాటును కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే శ్రీధర్‌బాబు నా సర్కారు లేదనే అంటడు. ఆయన ఇక్కడకు రాడు. ఆయనకు ఓటు వేయడం వల్ల ఇప్పటికే మంథని నియోజకవర్గం అభివృద్ధిలో ఐదేళ్లు వెనక్కి పోయింది. ప్రజలారా వివేకంతో ఆలోచించాలి. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

**- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

### బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వండి..

నేను ఈ మట్టిలోనే పుట్టిన. ఇక్కడే పెరిగిన. సింగరేణి, వ్యవసాయంపై పూర్తిగా అవగాహన ఉన్నది. గతంలో ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించిన. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించిన. పునరావాస కాలనీలను నిర్మింపజేసిన. ఓడినా మీధ్యనే ఉన్న. మీ కోసం పనిజేసిన. కానీ మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాయమాటలు చెప్పి నన్ను మీ నుంచి దూరం జేసిండు. ఇప్పుడు ఎన్నికలు రాగానే గోడగడియారాలు, నోట్ల కట్టలతో వస్తున్నడు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలె. బీసీ బిడ్డనైనా తనకు మరొక్కసారి అవకాశం ఇవ్వండి. దీవించి అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గాన్ని అన్నింటా ఆదర్శంగా నిలుపుత.

**- ప్రజా ఆశీర్వాద సభల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

### కవితక్క రాకతో మధన్న గెలుపు ఖాయమైంది

అనునిత్యం ప్రజా సేవే పరమావదిగా.. అభివృద్ధే ఆయుధంగా.. సంక్షేమమే ధ్యేయంగా.. సామాజిక సేవే లక్ష్యంగా.. ముందుకు సాగుతున్న మంథని మట్టి బిడ్డ పుట్ట మధన్న. ఎమ్మెల్సీ కవిత ఎప్పుడైతే కాటారం గడ్డ మీద అడుగు పెట్టిందో... అప్పుడే పుట్ట మధు గెలుపు ఖాయమైంది. బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేసిన ఆమె, మంథని అభ్యర్థి పుట్ట మధుకు మద్దతుగా ఇక్కడికి రావడం గొప్ప విషయం. నలభై ఎండ్ల కాంగ్రెస్ పాలనలో మంథనికి ఒరిగిందేమీలేదు. వారు చేసిన ఒక్క మంచిపనిలేదు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రతి పథకాన్ని గడపగడపకు తెచ్చి మీ చేతుల్లో పెట్టే పుట్ట మధును ప్రజలు గెలిపించుకోవాలి. ఈ నెల 30 కారు గుర్తుకు ఓటేయాలి.


**- ప్రజా ఆశీర్వాద సభల్లో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని**

# ఆలోచించి ఓటు వేయండి

- **మనుసున్న మధన్ననుగెలిపించండి**
- **ప్రజలు ఆలోచించి ఓటేయండి.. అభివృద్ధికి చోటివ్వండి**
- **కాటారం బహిరంగ సభలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

కాటారం, నవంబర్ 19: 'మంథని నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న పుట్ట మధన్న మనసున్న మనిషి. ఎవరైనా సాయం అడిగితే కాదనని వ్యక్తి. గతంలో ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఎన్నో అభివృద్ధి పనులు చేసిండు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. ఆయనను అఖడ మెజార్టీతో గెలిపిస్తే సీఎం కేసీఆర్ ఈ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటడు' అని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉద్ఘాటించారు. 'ఉద్యమ సమయంలో ఈ గడ్డపై అడుగు పెట్టిన. ఇప్పుడు మళ్లీ ఇక్కడికి రావడం అదృష్టం' అని వ్యాఖ్యానించారు. కాటారంలో ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌కు మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత, జయశంకర్ భూపాల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీరాకేశ్‌తో కలిసి హాజరయ్యారు. అనంతరం కాటారంతో తనది అవినాభావ సంబంధం అని ప్రసంగాన్ని ప్రారంభించడంతో జనం చప్పట్లతో మద్దతు తెలిపారు. ఈ గడ్డపైకి రావడం అదృష్టంగా భావిస్తున్నాననీ, నాడు తెలంగాణ ఉద్యమంలో ఇక్కడకు వచ్చినప్పుడు కాంగ్రెసోళ్లు నన్ను వెళ్లగొట్టే ప్రయత్నం చేసినా ప్రజలకు నా వెన్నంటి ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. డెబ్బై ఏండ్లలో ఏ ముఖ్యమంత్రి కూడా మంథని నియోజకవర్గాన్ని దత్తత తీసుకోలేదన్నారు. కానీ, మొన్న మంథనికి వచ్చిన సీఎం కేసీఆర్ పుట్ట మధును గెలిపిస్తే వెయ్యి కోట్లు ఇస్తానని ప్రకటించారని గుర్తుచేశారు. ప్రజలు జర ఆలోచన చేయాలని కోరారు. 'ఐదేళ్లలో మీ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఏం చేసిండో ఒక్కటి చెప్పమనండి. ఎవరికైనా సాయం చేసిండా అని అడగండి. పైసా సాయం చేయని ఆయనను సాగనంపండి' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుల్లెట్ లాంటి పుట్ట మధూకర్‌ను గెలిపించుకోని నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కోరారు. ఈ ఎన్నికలు ధర్మ పోరాటంతో సమానమని, ఈ పోరాటంలో అధర్మాన్ని గెలిపించుకొని మళ్లీ చీకటి రోజులు తెచ్చుకోవద్దని కోరారు. బీఆర్ఎస్ మూడోసారి గెలిచిన వెంటనే ₹5వేలుగా పెన్షన్ అవుతుందన్నారు. సౌభాగ్య లక్ష్మీ పథకం ద్వారా మహిళలకు నెలకు ₹3వేలు భృతి ఇవ్వబోతున్నాడన్నారు. రేషన్ కార్డుపై సన్న బియ్యం ఇస్తారని, ప్రతి సామాన్యుడికి ₹5లక్షల బీమా పథకం కూడా వస్తుందన్నారు. ఆరోగ్య శ్రీని ₹15లక్షలకు పెంచి ఆ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ ప్రాంతంలోని అసైన్డ్ భూములకు కూడా పూర్తి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వంట గ్యాస్ సిలిండర్‌ను ₹400కే ఇయ్యాలని నిశ్చయించుకున్నాడని, దీంతో మోదీ ఘాతం నుంచి ఆడబిడ్డలకు విముక్తి కలుగుతుందనగానే మహిళలు పెద్ద పెట్టున నినదించారు. ఈ మంథని బిడ్డ పీవీ నరసింహారావును ప్రజలు ప్రధాని స్థాయికి తీసుకవెళ్లారు. కానీ కాంగ్రెస్ వాళ్లు ఆయన్ను ఏనాడైనా స్మరించుకుంటున్నారా.? కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయన పేరు మీద జయంతి కార్యక్రమాలు, విగ్రహాలు నెలకొల్పుతూ మన గడ్డ బిడ్డగా మనం గౌరవించుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత జక్కు రాకేశ్, పార్టీ మండలాధ్యక్షుడు తోట జనార్దన్, కల్వచర్ల రాజు, జవ్వాజి తిరుపతి, కుంభం రాఘవరెడ్డి, కాళేశ్వరం దేవస్థాన చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మమత పాల్గొన్నారు.

# కారుకు ఓటేస్తే అందరికీ దళితబంధు



వైఎస్సార్టీపీ ఇన్‌చార్జి మోకెనపల్లి రాజమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి ఈశ్వర్

- **పథకాలను చూసే పార్టీకి ఆదరణ**
- **ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్**
- **బీఆర్ఎస్‌లో చేరిన వైఎస్సార్టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజమ్మ, 500 మంది మహిళలు**

ధర్మారం, నవంబర్19: కారు గుర్తుకు ఓటేసి తనను అఖండ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు పథకం అందుతుందని ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. కేసీఆర్ సర్కారు అమలు చేస్తున్న పథకాలను చూసే అన్ని పార్టీలు బీఆర్ఎస్‌వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. ఆదివారం బొమ్మారెడ్డిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్టీపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపల్లి రాజమ్మ ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర పర్యటనకు ఎన్నికల పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి అమిత్ షా, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ది కుటుంబ పాలన నడుస్తుందని చేసిన ఆరోపణలను మంత్రి ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. తమది తెలంగాణ ప్రజలతో కూడిన కుటుంబ పాలన అనే విషయాన్ని ఆ పార్టీ నేతలు గ్రహించాలని ఆయన హితవు పలికారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసిన వారికి ఓటుతో దీవించాలని కోరారు. ఇక్కడ జడ్పీటీసీ పూస్కూరు పద్మజ, ఏఎంసీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మేడవేణి తిరుపతి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, ఆర్ బి ఎస్ జిల్లా సభ్యుడు పూస్కూరు రామారావు,ధర్మారం ఉపసర్పంచ్ ఆవుల లత, పార్టీ బీఆర్ఎస్వీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సల్వాజీ మాధవరావు, నాయకులు మోకెనపల్లి శ్రీనివాస్, దేవి రాజలింగయ్య, చిదుగు సంపత్, దేవి రేణుక, కోమటిరెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.